# తెగీ-తెగని బంధం

నలువైపులా విస్తరించి ఆ మధ్యాహ్నపు మండు టెండలో చల్లని నీడనిచ్చే చింతచెట్టు చెట్టుక్రింద గుమిగూడారు జనం. కరణం కనకారావు మృతదేహం వారి మధ్యన ఉంది. ఒకే ఒక స్త్రీ ఎలుగెత్తి రోదిస్తూంది. ఆమె సత్తెవమ్మ.

చెట్టుకెదురుగా నూతి సిమ్మెంటు చపటామీద నూతిగట్టుకి నడుం ఆన్చి నిల్చుంది అన్నపూర్ణ. ఆమె అరికాళ్ళ క్రింద గచ్చునేల నిప్పులా ఉంది. వెన్నుకి తగిలే నూతిగట్టు అంచు కాలిన ఇనపరేకులా ఉంది. ఆమె హృదయంలో లావాలాంటి దుఃఖం పొర్లిపోతూంది. అయినా ఆమె కనులు చెమర్చలేదు.

అందరూ ఆమెవైపు విడ్డూరంగా చూచి, ఔరా ఎంతటి ఆడది! అని ముక్కుమీద వేలేసుకుంటున్నారు.

'సచ్చినోడు నీ మొగుడు కాదా! నీ బిడ్డలకు తండ్రి కాదా! నీకు దుఖం రాలేదా! తల్లీ' అని వ్యంగ్యంగా ప్రశ్నించినవారూ ఉన్నారు.

అయినా అన్నపూర్ణలో చలనంలేదు. అటే ఆ చింత చెట్టువైపూ గుమిగూడిన జనంవైపూ ఆమె దృక్కులు నిల్చి పోయాయ్.

ఆమె దృక్పథంలో గతం సుడి దిరిగి ఎదురునిల్చింది.

* * *

ఆ రోజు. సుమారు ముప్ఫయి సంవత్సరాల క్రితం, తమ ఇంటివీధి వసారాలో అరికెన్ లాంతరు దగ్గర కూర్చుని మాష్టారు ఇంటివర్కు క్రింద ఇచ్చిన బజారు బిల్లులెక్కలు చేసుకుంటూంది తను.

ఏమండీ కరణంగారున్నారా? అన్న గొంతు విని చివాలున తలెత్తి చూసింది.

అందంగా ఆకర్షణీయంగా ఇంకా వినయంగా కనుపించే పదహారేళ్ళ అబ్బాయిని చూస్తూ తడబాటుగా లేచి నిల్చుని 'ఇంకా పొలంనుంచి రాలేదు కూర్చోండి.' అంది అదే తడబాటుతో.

తాను నిల్చున్న చాప చివరన తల వంచి కూర్చున్నాడతను.

పరికిణీ కుచ్చెళ్ళు ముందుకు దగ్గరగా తీసుకుని తానూ కూర్చుంటూ, 'ఎందుకు? మీకు నాన్నగారి దగ్గర ఏం పని ఉంది?' అడిగింది.

అతను సిగ్గుపడుతూన్నట్లు మరి కాస్త తలవంచి, ఆయనతో చెప్పేప్పుడు వినొచ్చులెండి అన్నాడు.

మరి తాను ప్రశ్నించలేదు. మళ్ళీ లెక్కలు చెయ్యటంలో పడిపోయింది. మరికొంచంసేపటికి తన తండ్రి అచ్యుత రామయ్యా వచ్చాడు. వినయంగా నమస్కరించాడు చాపమీద కూర్చున్న అబ్బాయి లేచి నించుంటూ.

"ఎవరబ్బాయ్." అడిగాడు అచ్యుతరామయ్యా కనుబొమలు చిట్లించి ఆ అబ్బాయివైపు చూస్తూ.

నా పేరు కనకారావంటారండి హెడ్ మాస్టరుగారు మిమ్మల్ని కలియమన్నారండి. అన్నాడు కనకారావు. చాప కాలి బొటనవేలితో మీటుతూ తలవంచి నేలచూపులు చూస్తూ.

సర్లే, కూర్చో మాట్లాడతాను. అని లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని తిరిగి వచ్చి కొయ్యకుర్చీలో కూర్చుంటూ 'ఏం చేస్తుంటావబ్బాయీ!' అడిగాడు తన తండ్రి. తన చూపులు అనాలోచితంగా ఆ కనకారావుపైన పరచుకున్నాయ్. లేత హృదయం చలించింది. ఏవేవో తియ్యని ఊహలు.

నేనీ ఊర్లో చదువుకుందామని వచ్చానండి. నాకెవరూ లేరు. మూడు వారాలు కుదిరాయ్....ఆగాడు కనకారావ్.

ఆ మిగిలిన నాలుగు వారాలూ నేనిస్తాలే బుద్ధిగా చదువుకో....తన తండ్రి ఉదారంగా అనేశాడు. అంతే కాదు. తన ఇంట్లో ఆశ్రయమిచ్చాడు.

మెల్ల మెల్లగా కనకారావుతో స్నేహం ఏర్పడింది తనకు. ఆ స్నేహమే తియ్యని ప్రేమగా మారింది.

ఎనిమిదవ క్లాసు ప్యాసయి కరణం పొస్టులు చదువుకుంటూన్న కనకారావుని తాను పెళ్ళిచేసుకుంటానంటె, విస్మయంగా తనవైపు చూశాడు తన తండ్రి. కొంచంసేపు మాట్లాడలేకపోయాడు. తర్వాత 'అతనికేముందమ్మా. ఆస్తా పాస్తా, కనీసం ఉద్యోగమన్నా లేదు. ఎవరో కరణీకం ఇస్తామన్నారట. అదెంత నిజమో చెప్పలేం. ఆ ఉద్దేశ్యం వదులుకో తల్లీ' అన్నాడు.

తల్లి చివాట్లేసింది. నీకేం పొయ్యే కాలమే అతన్ని పెళ్ళాడతానంటావు ఒక్కగానొక్క పిలవు శుభ్రమైన సంబంధాలు వస్తూంటేనూ అని అవ్వాళంతా ఆమె ఏవేవో హితవులు చెబుతూనే ఉంది.

ఎవరెన్ని విధాల చెప్పినా తాను వినలేదు. చివరికి కనకారావు కూడా చెప్పాడు. నీ అభిప్రాయం మార్చుకో సుఖపడతావని. కాని తను సమ్మతించలేదు.

చివరికి తండ్రి తన కరణీకం కనకారావు కిచ్చి, తన నిచ్చి పెళ్ళి చేశాడు.

ఇద్దరు పిల్లల తల్లి అయ్యేదాకా తన బ్రతుకు మూడు పూవులూ ఆరుకాయలూ. తనను ప్రాణంగా ప్రేమించాడు కనకారావు. తన జీవితమొక స్వర్గధామ మనుకుంది.

కాని.... కాని.... ఈ చింతచెట్టు, ఇదే చింతచెట్టు, తన భర్త మృతదేహంపై సూర్యకిరణాలు సోకకుండా పందిరి అల్లిన ఈ చెట్టు, తన ఈ నిర్భాగ్యజీవితానికి కారణమయింది.

తనకూ భర్తకూ మధ్య ఇనపగోడలు లేపింది. తన జీవితంలో నిప్పులు చెరిగింది. ఇప్పుడు తననూ, తన భర్తనూ చూసి వికటాట్టహాసం చేస్తూంది. దీర్ఘంగా నిట్టూర్చింది అన్నపూర్ణ.

తన హృదయ మేనాడో కరడుగట్టుకుపోయింది. మనస్సేనాడో బండబారిపోయింది. వర్షించటానికిహ తన కనుల్లో నీరు మిగలలేదు.

సత్తెవమ్మ ఏడుపు కర్ణకఠోరంగా ఉంది. ముఖ మంతా చెమటబిందువులు క్రమ్మగా, బరువుగా కనులు మూసుకుంది అన్నపూర్ణ.

* * *

సత్తెవమ్మ, ఎవరీ సత్తెవమ్మ !

కూతురు ఇద్దరు బిడ్డల తల్లి అయ్యేసరికి కన్ను మూశాడు అచ్యుతరామయ్య. ఆస్తిపాస్తులతోపాటు ఇంటి పెత్తనం అల్లుడి చేతికి వచ్చింది. అయినా కనకారావు ఏ మాత్రం భార్యనూ అత్తగారినీ చిన్నచూపు చూడలేదు. భార్యను ప్రేమగానె చూస్తున్నాడు. అత్తగారిని గౌరవంగా గానే చూస్తున్నాడు.

ఉన్నట్టుండి మలుపు తిరిగింది అన్నపూర్ణ జీవితం. ఇద్దరి బిడ్డల తర్వాత మళ్ళీ గర్భవతి అయింది. ఆరోగ్యం దెబ్బ తినటంతో వైద్యం కోసం విశాఖపట్నం వెళ్ళింది.

ఆమె వెనుక ఆమె తల్లి సత్యవతి, పిల్లలూ కూడా వెళ్ళారు. కనకారావు పట్నానికీ ఉన్న ఊరుకీ తిరుగుతూ సతమత మవుతున్నాడు.

రెండు నెలలు గడిచాయి.

పట్నంనుంచి అప్పుడే వచ్చాడు కనకారావు. అతని మనస్సంతా చిరాగ్గాఉంది. శరీరం అలసి ఉంది. తలుపు తెరచి మంచంమీద ఉస్సురని చతికిలబడ్డాడు.

గాజులు గలగల విన్పించి చివాలున తలెత్తి గుమ్మం వైపు చూశాడు.

పెద్దపెద్ద పువ్వుల వాయిలుచీర కట్టిన సత్తెవమ్మ కనుపించింది. ఆమె తలలో ముడుచుకున్న మల్లెలు గప్పున సువాసన వెదజల్లాయి, సత్తెవమ్మ కనకారావు మనస్సు చెదరగొట్టింది.

కనకారావు ఇవ్వాళ కొత్తగాచూడలేదు సత్తెవమ్మని. తమ పొలం ఊడుపులకీ కోతలకీ చాలాసార్లు తండ్రితో కూలీకి వచ్చింది. కాని ఇవ్వాళ కొత్తగా కనిపిస్తూంది. మనస్సేదోలా పట్టు దప్పిపోతూంది.

సత్తెవమ్మ ఇంట్లోకి వచ్చింది. కుంపటి వెలిగిస్తూంది చనువుగా.

వద్దులే, నేను చేసుకుంటాను వంట. ప్రొద్దుపోయింది వెళ్ళిపో. మీ అయ్య తిడతాడు అనగలిగాడు కనకారావు.

'మా అయ్య ఈ రేత్తిరి ఇంటికి రాడు. నాయుడుగారి పొలంకాడికి సేను కాపుకెళ్ళాడు. పాలున్నాయి కాపీ కాసి స్తాను తాగండి కరణంగోరు....'కిసుక్కున నవ్వింది సత్తెవమ్మ.

ఆమె ఎందుకలా నవ్విందో అర్థంకాలేదు కనకారావుకి.

ఆమె మళ్ళీ ఇంటికి వెళ్ళి క్షణాల్లో పాలగ్లాసుతో తిరిగి వచ్చింది.

కాఫీ గ్లాసందిస్తూ కనకారావు చేతికి కావాలని తన వేళ్ళు తాకించింది.

కనకారావుకి నరాలు జివ్వుమన్నాయి.

'నాను వంట సేస్తె తినగూడదేటండీ?' గోముగా అడిగింది సత్తెవమ్మ చేతులు కట్టుకు వయ్యారంగా నిల్చుని.

"ఎందుకు తినగూడదు?" వెకిలి నవ్వు నవ్వాడు కనకారావు.

అతని వంటకు సాయం చేసింది. అతను అన్నం తింటూంటే దగ్గర కూర్చుని కబుర్లు చెప్పింది అతని భోజనం పూర్తి అయ్యాక గిన్నెలు కడిగి ఇల్లు సవరించింది.

చేతులు నులుముకుంటూ తలుపువార నిల్చున్న సత్తెవమ్మవైపు ఏదో ఆకలిగా చూస్తూ, 'ఇంక వెళ్ళి పడుకో' అన్నాడు కనకారావు.

'మీ ఇంట్లో పడుకోకూడదేటండి?' ఓరగా అతనివైపు చూస్తూ అంది సత్తెవమ్మ.

'నాయుడు ఊరుకుంటాడా?' అడిగాడు కనకారావు. అతనికి తెలుసు నాయుడుతో సత్తెవమ్మకు సంబంధముందని. 'సత్తెవమ్మ పచ్చగా ధృఢంగా పోతరించిన ఆభోతులా ఉంటుంది' నాయుడు ఆమెను ఒదులుతాడని నమ్మకం లేదు కనకారావుకి.

"తాటిబొందనాగ ఆడేం సేత్తడు ఒగ్గెయ్యక నాను కాదంటె. అవునట్టు పూర్ణమ్మగారెలాగున్నారండీ?"

'అలాగె ఉంది. ఏమిటో నా ఖర్మ. పురుడయేదాకా అక్కడే ఉంచాలట.'

'ఎలాగన్నా ఆమె ఆరోగ్యం సెడిపోనాదండీ. ప్చ్. పాపం.' సానుభూతిగా అంది సత్తెవమ్మ.

రెండు మూడు క్షణాలుదొర్లాయి మౌనంగా బరువుగా.

'నన్ను పొమ్మంతారేటండి?' అడిగింది సత్తెవమ్మ నవ్వుతూ.

'మరేమంటాను?' నీరసంగా అన్నాడు కనకారావు.

'ఏటండి కరణంగోరు శ్రీరామచంద్రులయిపోత్రను' నవ్వింది సత్తెవమ్మ.

ఆ నవ్వు అతనికి వెక్కిరింపులా అనిపించింది. ఓ పక్క పవిట జారవిడిచిన సత్తెవమ్మ వైపు చూస్తూంటే అతని నిగ్రహం సడలిపోతూంది. ఎంత నిలదొక్కుకున్నా మనస్సు నిలవడం లేదు; 'కొంచెం మంచినీళ్లు తీసుకురా!' అన్నాడు.

నీళ్ళగ్లాసు అందిస్తున్న సత్తెవమ్మ చెయ్యి గభాలున పట్టుకున్నాడు. తన చేతిని పట్టుకున్న అతని చేతిని రెండవ చేత్తో గట్టిగా పట్టుకుంటూ, 'నా మనుసు ఎన్నాళ్ళనుంచో మీా ఏపు నాగేస్తోంది కరణంగోరు' అంది సత్తెవమ్మ.

'నాయుణ్ణి వదిలేస్తావా!' అంటూ ఆమెను వడిలోకి లాక్కున్నాడు కనకారావు.

'మీారు చేసుకుంటూనంటే ఒగ్గేత్తానండి' అంది సత్తెవమ్మ అతని కౌగిలిలో ఒదిగిపోతూ.

ఆ రోజు ఆమెతోటి అనుభవం ఎప్పుడూ సత్తెవమ్మను వదలకూడదనుకున్నాడు కనకారావు.

*  *  *

ఇద్దరు కొడుకుల తర్వాత ఆడపిల్లను కన్న అన్నపూర్ణ మురిసిపోతూ ఇంటికి వచ్చింది పిల్లలను తీసుకొని.

సత్తెవమ్మకూ, కనకారావుకీ ఉన్న సంబంధం ఎన్నాళ్లో దాగలేదు. ఇరుగుపొరుగు అమ్మలక్కలు అన్నపూర్ణ చెవిన వేశారీ వార్త. మనస్సెంత మండినా నిగ్రహించుకుంది అన్నపూర్ణ. తాను ఎనిమిది నెలలు హాస్పిటల్లో ఉంది. మగవాడు మనస్సు కట్టుకోలేకపోయేడు. పోనీయ్. అని ఇక సత్తెవమ్మతో సంబంధం వదులుకోమని భర్తకు నచ్చజెప్పింది. బ్రతిమిలాడింది. ఏడ్చింది. తానెలా అతన్ని వివాహమాడిందో గతం గుర్తు చేసింది. చివరికి తిరగబడి తగవులాడింది.

మొదట తనకూ సత్తెవమ్మకూ ఏ సంబంధమూ లేదని దబాయించాడు కనకారావు. తర్వాత ఒప్పుకున్నాడు. ఆ తర్వాత ఆమెను వదలలేనన్నాడు. ఇంకా ఆమె నీకన్నా బిగువుగా అందంగా బాగుంటుందన్నాడు.

సహించలేకపోతూంది అన్నపూర్ణ. ఫలితం ఇంట్లో అశాంతి చోటుచేసుకుంది. సత్యవతి అల్లుణ్ణి కూతుర్నీ ఓ దారికి తేలేక సతమతమవుతూంది.

కనకారావు ఇంటిముందున్న చింతచెట్టుకాయలు దులిపిస్తూంది సత్తెవమ్మ.

చూచిన అన్నపూర్ణ చరున ఇవతలికివచ్చి, 'కాయలు దులిపిస్తున్నావ్ ఎవరిచ్చారు నీకీ అధికారం ? నీ బాబు నాటి పెంచాడా ఈ చెట్టు?' అడిగింది కోపంతో ఎఱ్ఱబారిన కనులతో సత్తెవమ్మసైపు చూస్తూ.

నిర్లక్ష్యంగా తలెగరేసి, 'కరణంగోరు తీసుకోమన్నారు మరేదగ ఇంట్లోకి వెళ్ళు.' అంది సత్తెవమ్మ.

అన్నపూర్ణ అభిమానం దెబ్బతింది. 'కరణమెవడు నీకీ పెత్తనం ఇవ్వటానికి ! ఆ చెట్టు నాది. నా బాబు నాటినది.' అని రెచ్చిపోయింది అన్నపూర్ణ.

ఇద్దరిమధ్యా మాటా మాటా పెరిగింది. కటువుగా పరుషంగా తిట్టుకుంటున్నారు.

అప్పుడే ఎటో వెళ్ళి తిరిగివచ్చిన కనకారావుకీ దృశ్యం కంటబడింది. సత్తెవమ్మ అలా తిట్టడం, వీధినబడి

అరవటం సహజంకాని అన్నపూర్ణ ఇలా తెగించటం అతని కేమీ బాగనిపించలేదు. సహించలేకపోయాడు. జనం గుమి గూడి సవతుల కయ్యం వినోదంగా చూస్తున్నారు.

అన్నపూర్ణ చెంప ఛెళ్ళుమంది.

ముడివిడిపోయి విరబోసిన జుత్తులో కాళీలా ఉన్న అన్నపూర్ణ, కనకారావు కాలరు పట్టి లాగి చొక్కా చింపి, నానామాటలాడింది.

అతను ఆమె జుట్టు పట్టుకున్నాడు. సత్యవతి గుండెలు బాదుకు ఏడ్చింది. జనం కలుగజేసుకుని భార్యాభర్తల్ని విడిపించారు.

అన్నపూర్ణ నూతివైపు పరుగుతీసింది. ఆమె తల్లి ఆమెను కౌగలించుకు ఏడ్చింది. మీ పిల్లలూ, నువ్వూ బ్రతకగల డబ్బు నా దగ్గరుంది. ఇలాటి సాహసం చెయ్యకు అని బ్రతిమిలాడి ఇంటికి తీసుకు వెళ్ళింది.

కరిణీకం మినహా మిగతా ఆస్తిపాస్తులన్నీ సత్యవతి, అన్నపూర్ణ వశం అయ్యాయి.

పిల్లలకోసం కలసి కాపురం చెయ్యాలని రాయబారాలు పంపాడు భార్యకు కనకారావు. సత్తెవమ్మను వదిలేస్తే అంగీకరిస్తానంది అన్నపూర్ణ.

సత్తెవమ్మను వదలలేకపోయాడు కనకారావు. ఫలితంగా భార్యాభర్తలిద్దరూ విడిపోయారు.

ఎదురెదురిళ్ళలో కాపురాలు చేస్తున్నా ఇద్దరిమధ్యా మాటలు లేవు. అతను వీధిలోకి వెళ్ళేవేళకు వీధినడవలో కిటికీదగ్గర నిల్చుని అతన్ని కనుమరుగయ్యేవరకూ చూస్తుంది అన్నపూర్ణ. ఆమె చంకన బిందె పెట్టుకొని కోనేటికి నీళ్ళకు వెళ్తూంటే, ఆమెవైపు చూసి పళ్ళు కొరుకుతాడు కనకారావు.

హైస్కూలు చదువు చదివించమని కొడుకులిద్దరూ అడిగిననాడు కాదనలేకపోయాడు కనకారావు. ఇద్దర్నీ చదివించాడు తన శక్తికి మించిన పనయినా. సత్తెమ్మ తన మెడలో పట్టెడ అమ్మి ఆ సొమ్ము కనకారావు కిచ్చింది.

రెక్కలు వచ్చిన పిల్లలు కనకారావుని కాతరు చెయ్యలేదు. మమ్మల్ని చదివించటం ఏమీ గొప్ప పని కాదన్నారు. తమ తల్లిని అన్యాయం చేశావని నిందించారు. తండ్రికి శత్రువులయిపోయారు.

విరక్తిగా నిర్లిప్తంగా జీవితం దొర్లించాడు కనకారావు. తనను వదలకుండా తన ఇంట్లో ఉంటూన్న సత్తెమ్మకే తన సంపాదన ఇచ్చేవాడు.

కొడుకులు తమతో రమ్మన్నా ఊరూ ఇల్లూ వదిలి వెళ్ళలేదు అన్నపూర్ణ. సత్యవతి కాలగర్భంలో కలిసి పోయింది. తానూ పెళ్ళికాని కూతురూ ఉన్నారింట్లో.

ఒకటీ, రెండూ, మూడురోజులు కనకారావు ఇంట్లోంచి బయటకు రాకపోవటంతో కంగారుపడింది అన్నపూర్ణ. కాని

అతని గురించి ఎవర్ని ప్రశ్నించటానికి ఆమెకు అభిమానం అడ్డు తగిలింది.

సత్తెవమ్మ వైద్యుణ్ణి ఇంట్లోకి తీసుకువెళ్ళటం చూసి అతని ఆరోగ్యం బాగులేదనుకుంది. ఇరుగుపొరుగులు అతని పరిస్థితి విషమించిందని అనుకొంటూంటె ఆఖరిసారిగా అతన్ని ఓసారి చూసి మాట్లాడి అతని హృదయంమీద తల ఆన్చి భోరున ఏడవాలనుకొంది. కాని ఏ ఒక్కటీ చెయ్యలేకపోయింది అన్నపూర్ణ.

*　　*　　*

'నాకేటీ సెప్పోరు కారు కరణంగోరో. నానెలా బతికేది సెబువులో. నీవూ నెత్తురూ దారపోసి కొడుకుల్ని సదివించి నావు కనకారాఓ. ఒక్కడూ నిన్ను బుగ్గి సెయ్యటానికి రానేదు ఇస్వాసఘాతకులండీ బాబూ! నా ఎట్టి కరణఓ నన్నిడిచి ఉండలేననిఓడిఓ. ఇప్పుడెలా ఎల్లిపోనారండీ. నానెలా బతికేదండీ. నన్నెవరు సూత్తారండీ!'

తల విరబోసుకు వయినాలు పెట్టి సివాలాడి ఏడుస్తూంది సత్తెవమ్మ.

కరణం అంత్యక్రియలు జరిపించటానికి గ్రామ పెద్దలు నడుం కట్టారు.

నిర్జీవ ప్రతిమలా నిల్చుని జనాన్ని చ్తూస్తూంది అన్నపూర్ణ. ఆమె పెళ్ళికానికూతురు చింతచెట్టునీడననిల్చుంది.

'నీకో రెండు అక్షింతలు పడలేదు తల్లీ' ఆమెపై సానుభూతి కురిపిస్తున్నారు పల్లెస్త్రీలు.

కరణం పాడె ఏటివైపు వెళుతూంది. అలే చూస్తూంది అన్నపూర్ణ. అప్పుడామె చూపులు ఉన్మాదినిలా ఉన్నాయి.

"ఎల్లిపోనారా కరణంగోరూ, మీరు నేని ఆ ఇంట్లోకి నా నెళ్ళలేను కనకారావుగారో. నన్నెంత అన్యాయం సేసిరావురో దేవుడా! నాకేటి దార్రా దేవుడా! నేనెవరికి అన్యాయం సెయ్యనేదు అమ్మల్లారా! నన్ను సూసి ఓర్చలేక పోయాడు దేవుడు" అని ముక్కు చీది తలముడేసుకొని "నాకు దిక్కెవర్రో దేవుడో నన్నెవరు సూత్తారు దేవుడో" అని మళ్ళీ ఏడుపు ప్రారంభించింది సత్తెవమ్మ.

"ఏటి అలా ఏడుత్తవు. నానున్నాను గదంటె నెగు" చెయ్యి ఊతం ఇచ్చాడు నాయుడు.

"నేనే పాపవూ ఎరగనండీ నాయుడుగోరూ!" అని మళ్ళీ ఏడ్చింది సత్తెవమ్మ.

పెళ్ళున నవ్వాడు నాయుడు. కనకారావుని నమ్మించి నాయుడితోకూడా సత్తెవమ్మ కాపురం చేస్తున్న సంగతి కరణానికి చెబితే నాయుడు నరికేస్తాడని ఆ ఊర్లో అందరికీ తెలుసు.

కరణం కనకారావు పాడె మలుపు తిరిగి కనుమరుగయ్యింది. ఏదో నూతిలో పడ్డ శబ్దమయ్యింది.

జనం నూతివైపు పరుగులు తీశారు.

అన్నపూర్ణ మృతదేహాన్ని బయటకు తీశారు. పంచాయితీ జరిగింది.

కనకారావు సరసనే మట్టిలో కలసిపోయింది అన్నపూర్ణ.